# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

గురువారం 27-7-2023




## ఎక్స్‌ప్రెస్ హైవేపై బైకిస్ట్ దుర్మరణం

### భారీగా ట్రాఫిక్ జామ్

**రంగారెడ్డి, జూలై 27 (తెలుగుప్రభ)**

రాజేంద్రనగర్ పీవీఎన్ఆర్ 152 పిల్లర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్రమైన గాయాలయ్యాయి. పిల్లర్ నెంబర్ 152 వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కిందపడడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం వల్ల ఎక్స్‌ప్రెస్ హైవే భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఎక్స్‌ప్రెస్ వే పై టూ వీలర్స్ నో ఎంట్రీ అయినా.. అటువైపు వెళ్లి ఆ వ్యక్తి మృత్యువుకు చేరువకావడం విచారకరం.

# అటెన్షన్ హైదరాబాద్

## పరిస్థితులు అదుపులోనే ఉన్నాయి కానీ..

**హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)**

అత్యవసరమైన పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని డీజీపీ అంజనీకుమార్ సూచించారు. చీఫ్ సెక్రటరీ ద్వారా ప్రతి జిల్లాలోని వర్షాలపై సమీక్షిస్తున్నామన్నారు. అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్, గ్రే హౌండ్స్, ఇతర అధికారులు డీజీపీ కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. 2900 మందిని రెస్క్యూ చేసి పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. మోచంపల్లి వరదల్లో చిక్కుకున్న వారిని ఎన్ఎస్ఎఫ్ బృందాలతో

రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ మూడు కమిషనరేట్ ల పరిధుల్లో పరిస్థితి అదుపులోనే ఉంది కానీ.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలాశయాల వద్దకు సెల్ఫీలు తీసుకోవడానికి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాల వద్ద కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేకంగా ఫ్లడ్ మానిటరింగ్ సెంటర్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితులను సమీక్షించి తగు సహాయ పునరావాస కార్యక్రమాలపై సలహాలు, సూచనలు, సహాయాన్ని అందించేందుకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఫ్లడ్ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. డీజీపీ అంజనీ కుమార్ సహా అదనపు డీజీలు శివధర్ రెడ్డి, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్ లతోపాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు ఈ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏ ప్రాంతంలోనైనా రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడితే శాటిలైట్ ద్వారా పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు తగు



ఆదేశాలు జారీ చేస్తున్నారు.

### ఈ టైంలో రాజకీయాలు సరికాదు..: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షా నేపథ్యంలో పట్టణాల్లో ఉన్న పరిస్థితులపై పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు సమీక్షించారు. పురపాలక శాఖ అధికారులు, అడిషనల్ కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోనూ పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో వరద పరిస్థితిని మంత్రి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద వచ్చి చేరుతోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వరాకాలం ప్రారంభానికి ముందే నాలాల్లో పూడిక తీశామని చెప్పారు. చెరువుల్లోనూ తక్కువ నీటిమట్టం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. నగరంలో ఎస్సార్‌డీపీ చేపట్టకముందు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని, ఇప్పుడా పరిస్థితి లేదని



చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో చేతనైతే ప్రతిపక్షాలు సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి కేటీఆర్ సూచించారు. వర్షాలను కూడా రాజకీయం చేయడం సరికాదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 14 బ్రిడ్జిలు మంజూరు చేశామన్నారు. చెరువుల బలోపేతం చేసే కార్యక్రమాలు కూడా చేపట్టాము. 135 చెరువులకు గేట్లు బిగించామని వివరించారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆయా ప్రాంతాల్లో వరద సమస్య బాగా తగ్గిందన్నారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని, రేపు తాను వెళ్తానని చెప్పారు.

## అందుకే భారీ వర్షాలు : ఐఎండీ

**న్యూఢిల్లీ, జూలై 27 (తెలుగుప్రభ)**

కొన్ని రోజులుగా బలహీనంగా ఉన్న రుతుపవనాలు రానున్న నాలుగు రోజుల పాటు తీవ్ర ప్రభావం చూపనున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, అందుకే మొత్తం 12 రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్ష హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు ప్రజలు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

## అప్రమత్తంగా ఉండాలి : ఎర్రబెల్లి

**వరంగల్, జూలై 27 (తెలుగుప్రభ)**

చెరువులు అలుగు పోస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విజ్ఞప్తి చేశారు. గత 5 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గ పరిస్థితులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా గ్రామాల పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ&అలాగే గ్రామంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాల్లో పాలు పంచుకోవాలని ఆదేశించారు. ఈ సమయంలోనే ప్రజలకు అండగా నిలబడాలని అన్నారు. వరదలతో ఏ సమస్య ఉన్నా, అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పెద్ద వంగర మండలం పోచంపల్లి ఘటన బాధాకరమని, అన్నదమ్ములు వరదలో కొట్టుకుపోయి చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసింది అన్నారు. వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియచేశారు.



## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

**నల్లగొండ, జూలై 27 (తెలుగుప్రభ)**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం అని దేవరకొండ ఎమ్మెల్యే జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపల్లి మండలం పొల్లెపల్లి రాంనగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి 80మంది ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్య మంత్రి కేసీఆర్ అని ప్రశంసించారు. కాంగ్రెస్ దిక్కులేని పార్టీగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తున్న ప్రతిసంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.



సామాజిక మాధ్యమాలపై ఫోకస్ పెట్టిన బీజేపీ, కాంగ్రెస్

తన ముద్ర ఉండేవిధంగా చూసుకుంటున్న కిషన్ రెడ్డి

– సునీల్ కనుగోలు వ్యూహాలతో సాగుతున్న కాంగ్రెస్

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల శంఖారావం అధికారికంగా మోగకపోయినా దాదాపు అన్ని ప్రధాన పార్టీలు ఆ దిశగా సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే తమ 'సోషల్ మీడియా' టీమ్స్‌ను ఫుల్ యాక్టివ్ మోడ్‌లో పెడుతున్నాయి.**

# 'సోషల్' ఫైట్



**తెలుగు ప్రభ జూలై 27 :**

తెలంగాణలో శాసనసభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇంకా విడుదల కాకముందే రాష్ట్రంలో రాజకీయ కాక ఫుల్ జోష్‌లో ఉంది. ఏ నియోజకవర్గంలో ఎవరికి సీట్ ఇవ్వాలి..? గెలుపు గుర్రాలేవి..? ఎక్కడ బలం ఉంది..? అభ్యర్థులను ఎక్కడ మార్చాలి..? ప్రజల మెప్పు పొందడం ఎలా..? వంటి సమాలోచనలతో అన్ని పార్టీల అధిష్టానాలు సతమతమవుతున్నాయి. ఇదే క్రమంలో ప్రజల అటెన్షన్‌ను తమవైపునకు మళ్లించేందుకు, ప్రత్యర్థుల మీద బురద జల్లేందుకూ 'సోషల్'గా ముందుకెళ్తున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని పార్టీలు తమ 'సోషల్ మీడియా వింగ్'లను యుద్ధ క్షేత్రాలుగా మార్చాయి. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ లు అధికార బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తమకు అనుకూలంగా ఉండే 'కంటెంట్'ను, 'అబద్ధాలను అందంగా' ప్రచారం చేసుకునేందుకు ప్రత్యేకంగా ఉద్యోగులనూ నియమించుకుంటున్నాయి. అవాస్తవాలను అందమైన మాటలుగా రాయగలిగే ఒక్కొక్కరికి నెలకు రూ. 40 వేల నుంచి రూ. 50 వేల దాకా చెల్లించేందుకూ రెడీ అంటున్నాయి.

ఈ కాలంలో సోషల్ మీడియా వినియోగం గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. పొద్దునలేచింది మొదలు మళ్లీ బేడ ఎక్కేదాకా యువత సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువ గడుపుతోంది. వాళ్ల బలహీనతే ఆసరాగా.. యువతరం ఓటర్లను తమవైపునకు మళ్లించుకునేందుకు గాను జాతీయ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. ఈ పనిని 2014 నుంచి నిర్విఘ్నంగా సాగిస్తున్న బీజేపీ.. కొద్దికాలంగా అదే బాటలో నడుస్తున్న కాంగ్రెస్‌లు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి.

### ఏం చేస్తారు..?

తెలంగాణలో కొన్నిరోజులుగా వానలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో నాలాల ఆక్రమణ కారణంగా కొద్దిపాటి వానకే రోడ్లు నదులను తలపిస్తాయి. ఇదే సోషల్ మీడియా బ్యాచ్‌కు కంటెంట్.. 'ఇదిగో.. ఇది నది కాదు. మన విశ్వనగరం. ఇక్కడ వానాకాలంలో బయటకు వెళ్లాలంటే పడవలు కొనుక్కోవాలి. భాగ్యనగరాన్ని డల్లాస్, లండన్‌గా చేస్తామన్న పెద్దమనుషులు ఎక్కడకు పోయారు..?'అని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ పోస్టు ప్రత్యక్షమవుతుంది. కొద్దిసేపట్లోనే ఈ పోస్ట్ వాట్సాప్ గ్రూప్‌లు, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, షేర్ చాట్.. ఇలా దాదాపు అన్ని మాధ్యమాలలోనూ వైరల్ అవుతోంది. అదే విధంగా ఎక్కడో మారుమూల గ్రామంలో ఓ రైతు ఏదో ఓ కారణంతో బలవన్మరణానికి పాల్పడతాడు. దానికి కారణమేదైనా కావొచ్చు.. కానీ ఈ 'వార్ జోన్' వీరులకు కావాల్సింది అది కాదు.. దానిలో కూడా ప్రభుత్వాన్ని బద్నాం చేయడ మే వీరికి కావలసింది. అందుకనే, జరిగిన ఘటనకు మసిపూసి మారేడు కాయలా చేసి సోషల్ గ్రూపులలో పడేస్తారు.

### తన మార్కు కోసం..

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న కిషన్ రెడ్డి.. పార్టీపై తనదైన ముద్ర వే య డా ని కి పాట్లు పడుతున్నారు. బండి సంజయ్ హయాంలో కిషన్ రెడ్డి వర్గానికి అంతగా ప్రాధాన్యత దక్కలేదన్న ఆరోపణలున్నాయి. కానీ ఇప్పుడు సీన్ మారింది. స్టేట్ చీఫ్‌గా ఎంపికయ్యాక ఆయన సోషల్ మీడియా టీమ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, సీనియర్ నాయకుడు యోగానంద్ కు సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించారు. అంటే ఇకనుంచి ఈ తంతు వీళ్ళ డైరెక్షన్లో నడుస్తుందన్నమాట.

### హామీలు సరిపోవు..

తెలంగాణలో కాంగ్రెస్ గెలిచేందుకు గాను 'కర్నాటక మోడల్'ను అమలుపరుస్తున్న ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా గాంధీ భవన్‌లో సోషల్ మీడియా టీమ్‌కు దిశా నిర్దేశం చేస్తున్నారు. ప్రభుత్వం మీద దండెత్తడానికి నాయకులతో పాటు వార్ జోన్ వారియర్స్‌కు 'ఇటువంటి' అస్త్రశస్త్రాలే అందిస్తున్నారు. ఇటీవలే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులతో పాటు సోషల్ మీడియా టీమ్‌తో కూడా ఆయన ప్రత్యేకంగా సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సామాజిక మాధ్యమాలలో ప్రచారం వంటి అంశాలపై చర్చించినట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. కర్నాటక మాదిరిగా ఇక్కడా 'ఐదు హామీలు' ఇస్తే గెలిచే పరిస్థితి లేదని, కేసీఆర్ వంటి నాయకుడిని ఢీకొట్టాలంటే అంతకుమించిన వ్యూహంతో అడుగులు వేయాలని, ప్రభుత్వ వ్యతిరేకతను విరివిగా ప్రచారం చేయాలని సూచించినట్లు సమాచారం. మరి ఈ 'వార్ జోన్'లు అసలైన ప్రజాక్షేత్రంలో ఓటర్లను ఏ మేరకు తమదిక్కుకు మళ్లిస్తాయో తెలియాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.

## కవాడిగూడలో కూలిన రేకుల ఇల్లు..

**కవాడిగూడ, జూలై 27**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి కవాడిగూడ బండ మైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న రేకుల ఇల్లు కూలిపోయింది. ఇల్లు రేకులు పడిపోతుండగా ఇంట్లో నివాసం ఉండే ముగ్గురు చిన్నారులు బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతా స్థానికులంతా ఊపిరిపీల్చుకున్నారు.

## హైకోర్టులో మళ్లీ చుక్కెదురు



**హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)**

తన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలంటూ వనమా వెంకటేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టుకు వెళ్లే వరకు తీర్పుపై స్టే ఇవ్వాలని వనమా హైకోర్టును కోరారు. అందుకు నిరాకరించింది హైకోర్టు. దీంతో వనమాకు మరోసారి చుక్కెదురైంది.

## గడువు పొడిగింపు

**హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)**



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును జులై 31 వరకు పెంచుతూ ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇచ్చిన ప్రకటన ప్రకారం జులై 25తో గడువు ముగియగా తాజాగా తుది గడువును ఈ నెలాకరు వరకు పొడిగించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఈ మేరకు పొడిగించారు. జులై 31 తర్వాత అడ్మిషన్లు పొందే విద్యార్థులు ఆలస్య రుసుము చెల్లించవల్సి ఉంటుందని తెలిపారు. ఆగస్టు 1 నుంచి 16 మధ్యలో చేరితే రూ.500 ఆలస్య రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక డిగ్రీ ప్రవేశాలకు నిర్వహిస్తోన్న దోస్త్ మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును జులై 28 వరకు పొడిగించారు. మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలని అధికారులు పేర్కొన్నారు.